క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాలకొండ రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కడియం చిరంజీవి అన్నారు. జంపరకోట సచివాలయం పరిధి బర్నసీతంపేటలో మంగళవారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భూలక్ష్మి, క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది టి.రామలక్ష్మి, పెంటయ్య, నీలవేణి తదితరులున్నారు.

'మాతోట, జీవ' విస్తీర్ణంపై దృష్టి



మాతోట ఫలసాయాలను పరిశీలిస్తున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం: మా తోట జీవ పైలెట్ ప్రాజెక్టును రైతులు సద్వినియోగించుకోవాలని నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్ కె.గణేష్‌కుమార్, నాబార్డ్ కన్సల్టెంట్ సత్య ఒగ్గు అన్నారు. మండలంలోని గొరడ గ్రామంలో మంగళవారం రైతులతో సమావేశమై ప్రాజెక్టు లక్ష్యాలను వివరించారు. 12 ఏళ్ల కిందట నాబార్డ్ ఆర్థిక సహకారంతో 500 మంది రైతులకు చెందిన 500 ఎకరాల్లో మాతోట కార్యక్రమం(పండ్ల తోటల పెంపకం) ప్రారంభించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. జీవ పైలట్ ప్రాజెక్ట్ కింద మొదటి విడతగా 40 మంది రైతులకు చెందిన 40 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధరంగాల ప్రోత్సాహంపై దృష్టిసారించినట్లు చెప్పారు. ఎంపిక చేసిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొని, ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు మిగతా రైతులకు మార్గదర్శకంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీవ ప్రాజెక్ట్ అధ్యక్షుడు తాడంగి జమ్మయ్య, కార్యదర్శి కిల్లక చిరంజీవి, డైరెక్టర్ ప్రహరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి




మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యం

సీతంపేట: గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా మంజూరైన అన్ని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.సత్యం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. దోమల నివారణకు యాంటీ లార్వా మందును స్ప్రేయింగ్ చేయించాలన్నారు. హౌసింగ్, నాడు-నేడు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

దోమల నివారణకు చర్యలు

భామిని: వ్యాధుల వ్యాప్తికి కారణమైన దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, అన్ని గ్రామాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయపార్వతి సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలో చేపట్టిన అల్ఫా సైపర్ మైత్రేన్ 5 శాతం మందు స్ప్రేయింగ్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ కె.విజయనిర్మల, సిబ్బందితో సమావేశమై విద్యార్థుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆమె వెంట భామిని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ఫణికుమార్, సబ్‌యూనిట్ అధికారి అప్పారావు ఉన్నారు.

అపస్మారక స్థితిలో గుర్తుతెలియని వృద్ధుడు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు

గుమ్మలక్ష్మీపురం: అపస్మారకస్థితిలో పడిఉన్న వృద్ధుడికి గుమ్మలక్ష్మీపురం గ్రామస్తులు ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందించారు. గుర్తుతెలియని ఓ వృద్ధుడు మూడు రోజులుగా గ్రామంలో సంచరిస్తూ కనిపించాడు. మంగళవారం ఉదయం ఓ ఇంటి ముందు అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆ వృద్ధుడిని గ్రామస్తులు గుర్తించి సర్పంచ్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన గ్రామ యువత సహకారంతో ఆ వృద్ధుడిని భద్రగిరి సీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. ప్రస్తుతం ఆ వృద్ధుడి ఆరోగ్యం నిలకడగా ఉందని, తాను ఎవరో, ఎక్కడ నుంచి వచ్చాడో చెప్పలేకపోతున్నాడని, వయసు సుమారు 70 ఏళ్లు ఉంటుందని గ్రామస్తులు చెపుతున్నారు.

పిల్లలకు మనం ఇచ్చే నిజమైన ఆస్తి విద్యే..

- పేద పిల్లల చదువుకు ప్రభుత్వం భరోసా..
- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: పేద పిల్లల బంగారు భవిష్యత్తుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారని, ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్యారంగంలో నూతన శకం మొదలైందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వండవ గ్రామంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి నాణ్యమైన విద్యే అని అన్నారు. పేద పిల్లల చదువుకు వారి ఆర్థిక సమస్యలు అడ్డుకాకూడదనే ఉద్దేశంలో అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు 3జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బూట్లు, సాక్షులు, తదితర వస్తువులను అందజేస్తున్నట్లు చెప్పారు. దీంతో లక్షలాది మంది విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గిందన్నారు. జగనన్న గోరుముద్ద పథకం కింద పౌష్టికాహారం, రాగిమాల్ట్ అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మిడితాన కళ్యాణి, వైస్ ఎంపీపీ విశ్వాసరాయి భార్గవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీతంపేట: పెదరామ పాఠశాలలో విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తిరుపతిరావు



గుమ్మలక్ష్మీపురం: జెడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ దీనమయ్య

పేద విద్యార్థుల చదువులకు భరోసా..

గుమ్మలక్ష్మీపురం: పేదరికం చదువుకు అడ్డుకారాదనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావుతో కలిసి మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బిడ్డిక భీముడు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వహీద్‌ఖాన్, ఉపాధ్యాయులు ఎం.సీతన్న, మురళీధర్, విశ్రాంత ఉపాధ్యాయుడు హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

- **సీతంపేట:** మండలంలోని పెదరామ ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ తిరుపతిరావు జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు. వాటిని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.
- **పాలకొండ:** నగరపంచాయతీ పరిధి పెదకాపువీధి ప్రభుత్వ పాఠశాలలో 17 వార్డు కౌన్సిలర్ దుప్పాడ పాపినాయుడు, హెచ్‌ఎం సోమేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ రోజారమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **భామిని:** మండలంలోని దిమ్మిడిజోల ఎంపీయూపీ స్కూల్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు కాగితాపల్లి కృష్ణారావు, వలరౌతు రామారావు జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. చదువుకు పేదరికం అడ్డకాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ వి.నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వీరఘట్టం: విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి



పాలకొండ: జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్న కౌన్సిలర్ డి.పాపినాయుడు, తదితరులు



భామిని: విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తి పారదర్శకతతో లబ్ధిదారులకు చేరవేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని పెద్దూరులో శనివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అని అన్నారు. నేడు దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూసేలా సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. ప్రజలకు ఓటు అడిగే హక్కు ఆయనకే ఉందన్నారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతుంటే చూడలేని ప్రతిపక్షం ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో 2019లో వచ్చిన ఫలితాల కంటే ఘోరంగా టీడీపీకీ, మరో తోక పార్టీకీ పరాభవం తప్పదన్నారు. అనంతరం గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయాన్ని సందర్శించి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. సచివాలయ సేవలను ప్రజలకు చేరువ చేయాలని, పౌరసేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి, ఎంపీటీసీ సవర ప్రశాంతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పెద్దూరులో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

70 మందికి వైద్య సేవలు



హెల్త్ రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ సాగర్‌వర్మ

గరుగుబిల్లి: ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కేకే సాగర్‌వర్మ అన్నారు. మండలంలోని ఉద్దవోలు గ్రామంలో మంగళవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి అక్కడి చిన్నారుల ఆరోగ్యాన్ని పరీక్షించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వరి విత్తనాల పంపిణీ

గరుగుబిల్లి: ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఆర్‌బీకేల ద్వారా రైతులందరికీ వరి విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ ఉరిటి రామారావు తెలిపారు. మండలంలోని గొట్టివలస ఆర్‌బీకేలో మంగళవారం వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా రైతులకు వందశాతం నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సమకూర్చుతోందన్నారు. అలాగే వైఎస్సార్ రైతుభరోసా నిధులను ఇటీవల రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసిందన్నారు. రైతులకు ఈ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ డి.చంద్రినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బి.చంద్రశేఖరావు, పి.సత్యనారాయణ, పి.శేఖర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ కావ్య, తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని పరజపాడు సచివాలయం పరిధిలోని రైతులకు రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న వరి విత్తనాలను చినమేరంగి పీఏసీఎస్ అధ్యక్షుడు తాడేల మన్మథరావు మంగళవారం పంపిణీ చేశారు. 154 మంది రైతులకు 292 బస్తాల విత్తనాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తాడేల తిరుపతినాయుడు, సర్పంచ్ గుంట్రెడ్డి రామకృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

భామిని: రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తోట సింహాచలం అన్నారు. భామిని రైతుభరోసా కేంద్రంలో మంగళవారం రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్సార్ రైతుభరోసా కింద సాగు పెట్టుబడి సాయం అందించడంతో పాటు ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలను ప్రభుత్వం సమకూర్చుతోందన్నారు. అలాగే పండిన పంటలను మద్దతుధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని అన్నారు. ఏఓ కె.సంహాచలం మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 15 టన్నుల విత్తనాలు వచ్చాయని, మరో పది టన్నుల విత్తనాలు రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గేదెల మోహన్, కద్రక సింహాచలం, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ



జియ్యమ్మవలస: పరజపాడులో వరి విత్తనాల పంపిణీ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందివ్వడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని కంబవలస గ్రామ సచివాలయం పరిధి కుమ్మరిగుంట గ్రామంలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది రూపాయల లబ్ధి చేకూరిందని అన్నారు. సంక్షేమ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోని మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని, ఈ ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆదరించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బావూజీనాయుడు, ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, పార్టీ కన్వీనర్ డి.జనార్దనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, సివిని, కొమరాడ పీఏసీఎస్‌ల చైర్మన్లు పప్పల గోపాలకృష్ణ, మరడాన సూరపునాయుడు, సర్పంచ్‌లు అంబటి వెంకటలక్ష్మి, దత్తి మురళీకృష్ణ, పార్టీ నాయకులు డాక్టర్‌శెట్టి మధుసుదనరావు, కెంగువ పోలినాయుడు, సచివాలయం కన్వీనర్లు ఎస్.స్వర్ణప్రియ, కొల్లు సింహాచలం, తోరిక సింహాచలం పాల్గొన్నారు.



కుమ్మరిగుంటలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కాంతమ్మా.. చల్లగా చూడమ్మా..

భామిని: మండలంలోని బురుజోలలో కాంతమ్మ తల్లి గ్రామదేవత సంబరాల్లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం పాల్గొన్నారు. గ్రామదేవత ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరినీ చల్లగా చూడమ్మా అని కాంతమ్మతల్లిని వేడుకున్నారు. అనంతరం సర్పంచ్ మడపాన కేశవరావు ఇంట్లో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ పత్తిక సింహాచలం, తదితరులు ఉన్నారు.

బత్తిలిలో బంగారమ్మతల్లి సంబరాలు

బత్తిలిలో బంగారమ్మతల్లి గ్రామదేవత సంబరాలను మంగళవానం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కలు చెల్లించి ముర్రాటలు సమర్పించారు.



గ్రామదేవత ఘటాలకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

ప్రజలకు అందుబాటులో ఉండాలి




కార్యదర్శులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశమయ్యారు. వర్షాకాలం ప్రారంభం కానున్న క్రమంలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయించాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పథకాల పంపిణీ తీరు, జగనన్న గృహ నిర్మాణాల తాజా స్థితిగతులపై సచివాలయాల వారీగా సమీక్ష చేపట్టారు. రక్తదాన దినోత్సవం సందర్భంగా అధికారుల పర్యవేక్షణలో బుధవారం స్థానిక కోటదుర్గ కళ్యాణ మండపం వద్ద నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం విజయవంతం చేయాలని కోరారు.

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ప్రారంభం

కొమరాడ: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు సిబ్బంది కృషిచేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో కొమరాడ మండలం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలన్నీ పార్వతీపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కింద ఉండేవి. అయితే కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక సంబంధిత అధికారులు పరిపాలన సౌలభ్యం కోసం కొమరాడను ప్రత్యేక ప్రాజెక్ట్‌గా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీడీ కె.విజయగౌరి, పీఓ సుగుణకుమారి, ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, సర్పంచ్ గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

క్రికెట్ టోర్నీ విజేత కొండవీధి జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీపీ దీనమయ్య, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని కొండవీధి యువత ఆధ్వర్యంలో నిర్వహించిన కొండవీధి ప్రీమియం లీగ్(కేపీఎల్) క్రికెట్ టోర్నీ విజేతగా కొండవీధి జట్టు, రన్నర్‌గా కొండవాడ జట్టు నిలిచాయి. నెల రోజుల పాటు జరిగిన ఈ టోర్నీలు పరిసర గ్రామాలకు చెందిన 70 టీమ్‌లు పాల్గొన్నాయి. అందులో కొండవీధి, కొండవాడ జట్లు ఫైనల్‌కు చేరుకోగా.. మంగళవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కొండవీధి జట్టు నిర్ణీత 12 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కొండవాడ జట్టు 12 ఓవర్లకు 60 పరుగులు చేసి ఆల్‌ఔట్ అయింది. విజేతలకు ఎంపీపీ కుంబురుక దీనమయ్య, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు నగదు పురస్కారంతో పాటు షీల్డ్‌ను అందజేశారు.

పనితీరు మార్చుకోండి: ఐటీడీఏ పీఓ

సీతంపేట: మండలంలోని ఓంద్రుజోల గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి మంగళవారం సందర్శించారు. విద్యార్థినుల హాజరు తక్కువగా ఉండడం, వార్డెన్ తప్ప మిగతా సిబ్బంది ఎవ్వరూ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టోర్ రూమ్ అపరిశుభ్రంగా ఉండడం, వంట సరుకులు పాడైపోయి ఉండటంతో సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్టీల్ గ్లాసుల్లో రాగిమాల్ట్



రాగిజావ కోసం గ్లాసులు పట్టుకుని క్యూలో ఉన్న బాలికలు

వీరఘట్టం: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వారంలో మూడురోజులు రాగిమాల్ట్‌ను అందిస్తున్నారు. విద్యార్థులు రాగిమాల్ట్ తాగేందుకు అవసరమైన స్టీల్ గ్లాసులను ప్రభుత్వం సరఫరా చేసింది. జిల్లా వ్యాప్తంగా 98,612 మంది విద్యార్థులకు ఈ గ్లాసులను పంపిణీ చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. వీరఘట్టం మండలం తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్టీల్ గ్లాసుల్లో రాగిజావ పంపిణీ చేశారు.

నేడు రక్తదానం శిబిరం

పాలకొండ: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బుధవారం వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే సందర్భంగా పాలకొండ పట్టణంలో శ్రీకోటదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. తరచూ రక్తదానం, ప్లాస్మాదానం చేయడం ద్వారా ఎంతో మందికి ప్రాణదానం చేసే అవకాశం కలుగుతుందన్నారు. యువత రక్తదాన శిబిరంలో పాల్గొని సహకరించాలని కోరారు.